PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 359 పేజీలు - 08 ఆదివారం 22 నవంబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నిన్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

విదేశాల్లో ఏఐ కేంద్రాలు నిర్మిస్తే జరిమానాలు

● అమెరికా సంస్థలకు ట్రంప్ హెచ్చరిక.. ● స్వదేశంలోనే డేటా కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశం



కాళోజీ కళాక్షేత్రం సాంస్కృతిక వైభవానికి వేదిక కావాలి

ప్రభుత్వ కార్యాలయాల తరలింపునకు సీఎం అడ్డుకట్ట..

కళా, సాహిత్య కార్యక్రమాల నిర్వహణకే వినియోగించాలని ఆదేశం



ఏఐ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌నే ఆధారంగా శిక్షించొద్దు

తప్పుడు ఫలితాలతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకూడదు.. సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించాలి: సీజేఐ జస్టిస్ సూర్యకాంత్





తెలంగాణకు రూ.4 వేల కోట్ల సఫ్రాన్ పెట్టుబడులు!

ఫ్రాన్స్ విమాన ఇంజిన్ల తయారీ సంస్థతో భట్టి విక్రమార్క చర్చలు..

డిసెంబరులో ఒప్పందంపై ఆశలు

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 21:

తెలంగాణలో విమానయాన, రక్షణ రంగాల తయారీ పరిశ్రమలను మరింత విస్తరించేందుకు ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ సంస్థ సఫ్రాన్ ఏకంగా రూ. 4 వేల కోట్ల పెట్టుబడులు పెట్టే అవకాశముంది. రాష్ట్ర ప్రభుత్వం సంస్థ ప్రతినిధులతో చర్చలు జరుపుతోంది. ఫ్రాన్స్ మిగతా2లో...



ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

- విద్యార్థులకు ప్రధాని మోదీ పిలుపు..
- ఐఐటీ ఖరగ్‌పూర్ వజ్రోత్సవాల్లో ప్రసంగం

తొలి అక్షరం/ఖరగ్‌పూర్,నవంబర్ 21: జీవితంలో కొత్త శిఖరాలను అధిరోహించాలంటే ముందుగా మనకు మనమే విధించుకున్న పరిమితులను అధిగమించాలని, ఆశయాలు, ఆకాంక్షలను మరింత విస్తరించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్వతంత్ర భారతదేశంలో తొలి ఐఐటీగా గుర్తింపు పొందిన ఐఐటీ ఖరగ్‌పూర్ 75 ఏళ్ల ప్రస్థానాన్ని మిగతా2లో...

చంద్రబాబుతో బీజేపీ నేతల భేటీ

కడప జడ్పీ చైర్మన్ పదవి కేటాయింపుపై ఆదినారాయణరెడ్డి అసంతృప్తి



తొలి అక్షరం/అమరావతి,నవంబర్ 21 : జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే సి. ఆదినారాయణరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశమయ్యారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి సీఎంను కలిశారు. తన సోదరుల కుమారులు చదిపిరాళ్ల రాజేశ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డిలు కూడా వెంట ఉన్నారు.కడప జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని బీజేపీకి కేటాయించకపోవడంపై ఆదినారాయణరెడ్డి అసంతృప్తితో ఉన్న నేపథ్యంలో ఈ భేటీ మిగతా2లో...

రాష్ట్రంలో కాంగ్రెస్ పనైపోయింది

రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం..

ఖైరతాబాద్ ఉప ఎన్నికకు సిద్ధం కావాలి

తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ నాయకుల చేరిక.. హరీశ్‌రావు వ్యాఖ్యలు



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 21 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ప్రవీణ్, శ్రీనాథ్ తదితరులకు హరీశ్‌రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పాలనపై పలు విమర్శలు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహారశైలితో హైదరాబాద్ నగర ప్రతిష్ఠ దెబ్బతింటోందని హరీశ్‌రావు ఆరోపించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన హైదరాబాద్ నగర అభివృద్ధి, మౌలిక వసతుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో జరుగుతున్న పార్టీ చేరికలు బీఆర్ఎస్ పట్ల నాయకులు, కార్యకర్తల్లో మిగతా2లో...

కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతిపై విచారణ చేస్తాం

- బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజాధనం తిరిగి వసూలు చేస్తాం: రాంచందర్‌రావు



హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం

మత్తు పదార్థాల తయారీకి మూతపడిన కంపెనీలు అడ్డాలు..

ఇళ్ల మేడలపై గంజాయి సాగు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 21: హైదరాబాద్‌లో డ్రగ్స్ చలామణి విచ్చలవిడిగా పెరుగుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని కొన్ని మూతపడిన కంపెనీలను మత్తు పదార్థాల తయారీకి అడ్డాలుగా ఉపయోగిస్తున్నారని, ఇళ్ల మేడలపైనా గంజాయి మొక్కలు పెంచుతున్నారని పేర్కొన్నారు. శనివారం శ్రీ సత్యసాయి నిగమాగమంలో నిర్వహించిన 'సిటీ కన్వెన్షన్ ఆన్ డ్రగ్ ఫ్రీ ఇండియా' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.భారతదేశానికి యువతే అతిపెద్ద ఆస్తి అని, అలాంటి యువత మత్తు పదార్థాలకు బానిసలవడం దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమని కిషన్‌రెడ్డి అన్నారు. గతంలో పంజాబ్‌ను తీవ్రంగా ప్రభావితం చేసిన డ్రగ్స్ సమస్య ఇప్పుడు తెలుగు రాష్ట్రాలకూ విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని బస్తీల మిగతా2లో...

హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం

(మొదటి పేజీ తరువాయి)

నుంచి ఐటీ కారిడార్ల వరకు యువతను మత్తు పదార్థాలు ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు.డ్రగ్స్ నియంత్రణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక సంస్థలు, యువత, ఐటీ నిపుణులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో ప్రభావం చూపగల వ్యక్తులు యువతలో అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని సూచించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా యువతకు మార్గనిర్దేశం చేయాలని కోరారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశాన్ని 2029 నాటికి డ్రగ్స్ రహితంగా మార్చాలనే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తోందని తెలిపారు. 'నషా ముక్త్ భారత్' ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పలువురు ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు, యువత పాల్గొన్నారు. నవంబర్ 25 నుంచి 27 వరకు అంబర్‌పేట నుంచి జూబ్లీహిల్స్ వరకు మూడు రోజుల పాదయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

కాళోజీ కళాక్షేత్రం సాంస్కృతిక వైభవానికి వేదిక కావాలి

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 21: ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆశయాలకు అనుగుణంగా నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని కళా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కళాక్షేత్రంలో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నారనే వార్తలపై స్పందించిన ఆయన, ఎలాంటి ప్రభుత్వ కార్యాలయాలను అక్కడికి తరలించవద్దని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను ఆదేశించారు.తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక రంగాలకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచేలా ఈ కళాక్షేత్రాన్ని వినియోగించాలని సీఎం సూచిం చారు. కవులు, రచయితలు, కళాకారులు తమ ప్రతిభ ను ప్రదర్శించేందుకు ఇది ప్రధాన వేదికగా నిలవాలని పేర్కొన్నారు. కళాక్షేత్రంలో నిర్వహించాల్సిన కార్యక్ర మాలపై కాళోజీ ఫౌండేషన్ సభ్యులతో చర్చించి కార్యా చరణ రూపొందించాలని కలెక్టర్‌కు సూచించారు. కాళోజీ సాహిత్య వారసత్వాన్ని భావితరాలకు పరిచ యం చేసేలా సాహిత్య సమ్మేళనాలు, కవిసమ్మేళనాలు, కళా ప్రదర్శనలు, సాంస్కృతిక వేడుకలు నిర్వహించేం దుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజాకవి కాళోజీ పేరుతో నిర్మించిన ఈ కళాక్షేత్రం తె లంగాణ కళా, సాహిత్య రంగాల అభివృద్ధికి కేంద్రంగా నిలవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు.

తెలంగాణకు రూ.4 వేల కోట్ల సఫ్రాన్ పెట్టుబడులు!

(మొదటి పేజీ తరువాయి)

పర్యటనలో భాగంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పారిస్ సమీపంలోని ఎవ్రీ-కోర్బెయిల్‌లో ఉన్న సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ తయారీ కేంద్రాన్ని సందర్శించి సంస్థ ఉన్నతాధికారులతో సమావేశమ య్యారు.తెలంగాణలో ఇప్పటికే కొనసాగుతున్న సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించడం, కొత్త తయారీ కేంద్రాల ఏర్పాటుపై ఈ సందర్భంగా చర్చించారు. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, మెరుగైన మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు అనుకూలమైన విధానాలు ఉన్నాయని భట్టి విక్రమార్క సంస్థ ప్రతినిధులకు వివరించారు. తెలంగాణలో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని కోరారు. **హైదరాబాద్‌లో ఇప్పటికే కార్యకలాపాలు**సఫ్రాన్ సంస్థకు హైదరాబా ద్‌లో ఇప్పటికే గణనీయమైన ఉనికి ఉంది. లీప్ విమా న ఇంజిన్లకు అవసరమైన కీలక విడిభాగాల తయారీ కేంద్రంతో పాటు సఫ్రాన్ ఎలక్ట్రికల్ అండ్ పవర్ పరిశ్రమ, విమాన ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతులు, పునరుద్ధరణ సేవల కేంద్రం ఇక్కడ పనిచేస్తున్నాయి. ఈ కార్యకలాపాలను మరింత విస్తరించడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ విమానయాన పరిశ్రమల తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. **డిసెంబరులో ఒప్పందం**పై **ఆశలు**ప్రతిపాదిత రూ.4 వేల కోట్ల పెట్టుబడికి సంబంధించి డిసెంబరులో నిర్వహించను న్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'లో అవగాహన ఒప్పందం కుదిరే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు భావిస్తు న్నాయి. ఈ సదస్సుకు సఫ్రాన్ సంస్థ ప్రతినిధుల బృందాన్ని ఆహ్వానించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. పరిశ్రమలు, వాణిజ్య శాఖ అధికారులు సంస్థతో తదుపరి చర్చలు జరిపి పెట్టుబడి ప్రతిపాదనను ఖరారు చేయనున్నారు. ఈ పెట్టుబడి కార్యరూపం దాలిస్తే రాష్ట్రంలో విమానయాన విడిభాగాల తయారీ రంగానికి మరింత ఊతం లభించడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.

రాష్ట్రంలో కాంగ్రెస్ పనైపోయింది

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న ఆసక్తిని తెలియజేస్తున్నాయని అన్నారు.రాష్ట్రంలో తాగునీటి సమస్యపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రోజుకు 80 వేల వాటర్ ట్యాంకర్లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ప్రజలకు తాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మరోవైపు తెలంగాణ రైజింగ్ పేరుతో ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు పొంతన లేదని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రానికి ఎన్ని పరిశ్రమలు వచ్చాయి? ఎంతమందికి ఉపాధి లభించింది? అనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. పరిశ్రమల ఏర్పాటుపై పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, అర్హులైన పేదలకు పింఛన్లు అందించడం వంటి అంశాల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వి. శ్రీనివాస్‌గౌడ్ తదితర బీఆర్ఎస్ నాయకులు, ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు

12 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం.. రూ.3,723 కోట్లతో అభివృద్ధి పనులు

తొలి అక్షరం/అమరావతి,నవంబర్ 21: 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు వేగవంతం చేసింది. పుష్కరాలకు 10 నుంచి 12 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్న నేపథ్యంలో, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు.పుష్కరాల ఏర్పాట్ల కోసం 22 ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో రూ.3,723.69 కోట్లతో 4,862 పనులను ప్రతిపాదించారు. వీటిలో రూ.2,051.70 కోట్ల విలువైన 2,260 పనులకు ఇప్పటికే పరిపాలనా అనుమతులు లభించాయి. పనులన్నీ 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని సీఎం గడువు విధించారు. **440 ఘాట్లలో సౌకర్యాలు**

గోదావరి తీరంలోని 440 ఘాట్లను అభివృద్ధి చేసి, భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, పారిశు ధ్యం, భద్రతా ఏర్పాట్లు కల్పించనున్నారు. రూ.300 కోట్లతో 78 రహదారుల పనులు చేపట్టి 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా



పెట్టుకున్నారు.**రవాణా, వైద్య సేవలకు ప్రాధాన్యం** భక్తుల రాకపోకల కోసం 4 వేల ప్రత్యేక బస్సులు, 649 గ్రీన్ బస్సులు నడపాలని ప్రణాళిక రూపొందించారు. 1,560 ప్రత్యేక రైళ్ల ఏర్పాట్లపైనా దృష్టి సారించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో అదనంగా 100 పడకలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఘాట్ల వద్ద వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. **135 భాషల్లో ఏఐ సేవలు** దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులకు సమాచారం అందించేందుకు 135 భాషల్లో పనిచేసే ఏఐ చాట్‌బాట్‌ను ఏర్పాటు చేయనున్నారు. డిజిటల్ తెరలు, వర్చువల్ రియాలిటీ సదుపాయాలతో పాటు రద్దీని పర్యవేక్షించేందుకు కమాండ్ కంట్రోల్ వ్యవస్థను వినియోగించనున్నారు.గోదావరి నది కలుషితం కాకుండా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పారిశు ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. నదీ హారతి, సామూహిక కూచిపూడి నృత్య ప్రదర్శన, యోగా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పుష్కరాల నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు.

విదేశాల్లో ఏఐ కేంద్రాలు నిర్మిస్తే జరిమానాలు

తొలి అక్షరం/వాషింగ్టన్,నవంబర్ 21 :

విదేశాల్లో కృత్రిమ మేధ (ఏఐ) డేటా కేంద్రాలను ఏర్పాటు చేసే అమెరికా సాంకేతిక సంస్థలపై భారీ జరిమానాలు, పన్నులు విధిస్తామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అమెరికా కంపెనీలు తమ పెట్టుబడులను ఇతర దేశాలకు తరలించకుండా, స్వదేశంలోనే డేటా కేంద్రాలను నిర్మించాలని స్పష్టం చేశారు.విదేశాల్లో ఏర్పాటు చేసే డేటా కేంద్రాల ద్వారా కీలక సాంకేతిక పరిజ్ఞానం ఇతర దేశాల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో సెమీకండక్టర్ చిప్స్ తయారీ వంటి రంగాల్లో అమెరికా అనుసరించిన విధా నాల వల్ల నష్టపోయామని పేర్కొన్నారు. గూగుల్, మెటా వంటి దిగ్గజ సంస్థలు అమెరికాలోనే పెట్టు బడులు పెట్టాలని సూచించారు.అయితే, ఏఐ డేటా కేంద్రాల ఏర్పాటుతో విద్యుత్ వినియోగం పెరిగి, ప్రజలపై అదనపు భారం పడుతుందనే ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్య ంలో ట్రంప్ తాజా హెచ్చరికలు అంతర్జాతీయ సాంకేతిక రంగంలో చర్చనీయాంశంగా మారాయి.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

(మొదటి పేజీ తరువాయి)

పురస్కరించుకుని నిర్వహించిన ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సంస్థ 75 ఏళ్ల ప్రస్థానానికి గుర్తుగా ప్రత్యేక స్మారక నాణేన్ని ఆవిష్కరించారు.మన ఆలోచనలు, కలలు, ఆశయాలు, ప్రతిభకు మనమే హద్దులు విధించుకుంటూ ఉంటామని మోదీ పేర్కొన్నారు. కొన్ని నమ్మకాలు, భయాల కారణంగా ఉన్న అవకాశాలను కూడా అందిపుచ్చుకోలేక ప్రయత్నాలను మధ్యలోనే వదిలేస్తామని అన్నారు. అయితే స్వయంగా ఏర్పరచుకున్న ఈ పరిమితులను ఛేదించినప్పుడే మనలోని పూర్తి సామర్థ్యాన్ని వెలికితీయగలమని, కొత్త అవకాశాలకు మార్గం సుగమం అవుతుందని వివరించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను చిన్నవిగా నిర్దేశించుకోకుండా, ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలని సూచించారు.దేశానికి తొలి ప్రాధాన్యత ఇచ్చే ఆలోచనా విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకుంటే అభివృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయని ప్రధాని అన్నారు. తన పాలనలోనూ గతంలో అసాధ్యమని భావించిన అనేక లక్ష్యాలను సాధించామని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశ నిర్మాణంలో ఐఐటీ ఖరగ్‌పూర్ కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్య సాధనలో ఈ విద్యాసంస్థ మరింత కీలకంగా నిలవాలని ఆకాంక్షించారు.ప్రపంచ బ్యాంకు నివేదికను ప్రస్తావిస్తూ గత 1213 ఏళ్లలో దేశంలో దాదాపు 50 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని మోదీ పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యాన్ని సాధించడంలో ఐఐటీ ఖరగ్‌పూర్ తనవంతు పాత్ర పోషించాలని అన్నారు.ఈ సందర్భంగా ఐఐటీ ఖరగ్‌పూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుమన్ చక్రవర్తి మాట్లాడుతూ, తమ సంస్థ పూర్వ విద్యార్థి, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అనువర్తిత కృత్రిమ మేధస్సు పరిశోధనల కోసం 50 లక్షల డాలర్ల విరాళం అందించారని వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్.రవి, ముఖ్యమంత్రి సువేందు అధికారి, ఉన్నత విద్యాశాఖ మంత్రి జగన్నాథ్ చటోపాధ్యాయ తదితరులు వేడుకలకు హాజరయ్యారు. అనంతరం బీహార్‌లో నితీశ్ సేతు వంతెనను మోదీ ప్రారంభించారు.

చంద్రబాబుతో బీజేపీ నేతల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రాధాన్యం సంతరించుకుంది. సీట్ల సర్దుబాటులో భాగంగా కడప జడ్పీని బీజేపీకి కేటాయించలేకపోయామని చంద్రబాబు ఆయనకు వివరించినట్లు సమాచారం.అంతకుముందు ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసినప్పటికీ, తన సేవలను గుర్తించకుండా జడ్పీ చైర్మన్ పదవి విషయంలో వ్యవహరించిన తీరు బాధించిందని పేర్కొన్నారు. పులివెందులలోనూ కూటమి విజయానికి పనిచేశానని తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతిపై విచారణ చేస్తాం

తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 21:

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు తెలిపారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారి నుంచి ప్రతి పైసా తిరిగి వసూలు చేస్తామని స్పష్టం చేశారు. శనివారం పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, మేధావులు, విద్యావేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు బీజేపీలో చేరిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో బీజేపీ బలపడుతుండటంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లో మెటా సంస్థ కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటనల వల్ల అంతర్జాతీయ పెట్టుబడిదారుల్లో ఆందోళన ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఒకవైపు పెట్టుబడులను ఆహ్వానిస్తూ సదస్సులు నిర్వహిస్తున్న ప్రభుత్వం, మరోవైపు బహుళజాతి సంస్థల కార్యాలయాలపై దాడులు జరుగుతుంటే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే న్యాయపరంగా పరిష్కరించుకోవాలే తప్ప దాడులకు పాల్పడటం సరికాదన్నారు.రాష్ట్ర అప్పులు దాదాపు రూ.10 లక్షల కోట్లకు చేరాయని, ప్రభుత్వ భూములను విక్రయిస్తూ పాలన సాగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు మద్దతు ధర కంటే తక్కువకు పంట విక్రయించాల్సి వస్తోందని ఆరోపించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఏఐ సదస్సు సందర్భంగా యువజన కాంగ్రెస్ చేపట్టిన నిరసన దేశ ప్రతిష్ఠను దెబ్బతీసిందని అన్నారు.బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవినీతికి పాల్పడిన వారెవరినీ వదిలిపెట్టబోమని, సమగ్ర విచారణ ద్వారా ప్రజాధనానికి సంబంధించిన ప్రతి పైసాకు లెక్కలు తేలుస్తామని రాంచందర్‌రావు స్పష్టం చేశారు.

ఏఐ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌నే ఆధారంగా శిక్షించొద్దు

- తప్పుడు ఫలితాలతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకూడదు.. సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించాలి: సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 21:

కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా రూపొందించిన రచనలను గుర్తించే సాఫ్ట్‌వేర్ ఫలితాలనే ఆధారంగా చేసుకుని విద్యార్థులను అక్రమాలకు పాల్పడినవారిగా నిర్ధారించకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఏఐ గుర్తింపు సాధనాలు తప్పు ఫలితాలు ఇచ్చే అవకాశం ఉందని, వాటి కారణంగా నిజాయితీగా పనిచేసిన విద్యార్థులు నష్టపోకూడదని అన్నారు.హైదరాబాద్‌లో జరిగిన కామన్వెల్త్ న్యాయ విద్యా సంఘం అంతర్జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆంగ్లాన్ని మాతృభాషగా మాట్లాడని విద్యార్థులు రాసిన వ్యాసాల్లో 60 శాతానికి పైగా రచనలను ఏఐతో రూపొందించినవిగా కొన్ని గుర్తింపు సాధనాలు తప్పుగా పేర్కొన్న అధ్యయనాన్ని ఆయన ప్రస్తావించారు. కేవలం యంత్రం ఇచ్చిన ఫలితం ఆధారంగా విద్యార్థిపై చర్యలు తీసుకోవడం సరికాదన్నారు.ఏఐ సాధనాలను పూర్తిగా నిషేధించడం ఆచరణ సాధ్యం కాదని, వాటి వినియోగంపై స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని సూచించారు. విద్యార్థులు ఏఐ సహాయం తీసుకున్నప్పుడు ఆ విషయాన్ని వెల్లడించే విధానం ఉండాలన్నారు. రాత పరీక్షలతోపాటు మౌఖిక వివరణలు, న్యాయపరమైన ఆధారాలపై చర్చలు నిర్వహించాలని సూచించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు ఊరట

- ఈ నెల 25 నుంచి బాండ్ల ధృవీకరణ

- రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రత్యేక కేంద్రాలు

- మండలాల వారీగా పక్కా షెడ్యూల్ విడుదల

- రూ.447 కోట్ల కుంభకోణం..1.65 లక్షల మంది బాధితులకు వెరిఫికేషన్

- అసలు బాండ్లు ఇవ్వాల్సిన పనిలేదు..కలర్ జిరాక్స్‌పై సంతకం చేస్తే చాలు

- తెలంగాణ రాష్ట్ర సీఐడీ విభాగం వెల్లడి



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి (పి.సైదులు),నవంబర్ 21: అగ్రిగోల్డ్ బాధితులు, డిపాజిటర్లు, చట్టబద్ధ వారసులు, ఏజెంట్లకు తెలంగాణ సీఐడీ శుభవార్త అందించింది. అగ్రిగోల్డ్‌కు సంబంధించిన సుమారు రూ. 447 కోట్ల కుంభకోణంలో ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన సీఐడీ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 1.65 లక్షల మంది బాధితులకు న్యాయం, ఉపశమనం కల్పించే దిశగా కీలక అడుగు వేసింది. డిపాజిటర్లు, ఏజెంట్ల వద్ద ఉన్న అసలు అగ్రిగోల్డ్ బాండ్లు, రసీదుల ధృవీకరణ (వెరిఫికేషన్),నమోదు ప్రక్రియకు సీఐడీ డైరెక్టర్ జనరల్ కార్యాలయం సమగ్ర షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రత్యేక ధృవీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సీఐడీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ కేంద్రాలు ఈ నెల 25 నుండి పనిదినాల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయి. బాధితులు తమకు కేటాయించిన తేదీల ప్రకారం, మండలాల వారీగా నిర్దిష్ట కేంద్రాలకు హాజరుకావాలని అధికారులు కోరారు. **ఎక్కడెక్కడ కేంద్రాలు.. ఇన్‌చార్జ్‌లు ఎవరంటే?** జిల్లాల వారీగా బాధితుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన 10 కేంద్రాలు, వాటి పరిధి సంప్రదించాల్సిన అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ (హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి, వికారాబాద్): సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్), హైదరాబాద్ సిటీ పోలీస్ బిల్డింగ్, బషీర్‌బాగ్. ఇన్చార్జ్: పి.గోపాల్ రావు (87126 60836). ఖమ్మం: ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్, ఖమ్మం. ఇన్చార్జ్: ఎస్.డి. సర్వర్ (87126 59185). కొత్తగూడెం (భద్రాద్రి కొత్తగూడెం, భద్రాచలం): జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్, బీకేజీఎం. ఇన్చార్జ్: ఎ.రామకాంత్ (87126 82133). వరంగల్ (వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగాం, ములుగు): సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్, వరంగల్. ఇన్చార్జ్: ఇ.హరికృష్ణ (87126 85137). మహబూబ్‌నగర్ (మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట): జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్, మహబూబ్‌నగర్. ఇన్చార్జ్: జి.రవిబాబు (87126 59306). నల్గొండ (నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి): జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్, నల్గొండ. ఇన్చార్జ్: డి.శ్రీను (87126 70160). మంచిర్యాల (మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్): నస్పూర్ (నరూర్/నార్స్‌పూర్) పోలీస్ స్టేషన్, మంచిర్యాల. ఇన్చార్జ్: వై.కృష్ణారెడ్డి (98853 52522). కరీంనగర్ (కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల): ఆస్ట్ర కన్వెన్షన్ హాల్, కమిషనరేట్ ప్రాంగణం, కరీంనగర్. ఇన్చార్జ్: ఆర్.ప్రకాష్ గౌడ్ (87126 70703). నిజామాబాద్ (నిజామాబాద్, కామారెడ్డి): ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్, నిజామాబాద్. ఇన్చార్జ్: సి.హెచ్.అజయ్ (87126 59823). మెదక్ (మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి): జిల్లా పోలీస్ కార్యాలయం, మెదక్. ఇన్చార్జ్: ఎం.జార్జ్ (87126 57908). **పత్రాల సమర్పణ.. ముఖ్య నిబంధనలు:** వెరిఫికేషన్ కేంద్రాలకు వచ్చే బాధితులు, నామినీలు, చట్టబద్ధ వారసులు మరియు ఏజెంట్లు తమ సందర్భాన్ని బట్టి నిర్దేశిత పత్రాలతో హాజరు కావాలని సీఐడీ సూచించింది. డిపాజిటర్ జీవించి ఉంటే: అసలు బాండ్/రసీదు (కేవలం పరిశీలన కోసం చూపించాలి), సెల్ఫ్ అటెస్టెడ్ కలర్ జిరాక్స్, ఆధార్, పాన్ కార్డు జిరాక్స్‌లు, బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ (పేరు, ఖాతా సంఖ్య, ఐఎఫ్‌ఎస్సి కోడ్ స్పష్టంగా ఉండాలి, ఖాతాకు మొబైల్ నంబర్ లింక్ అయి ఉండాలి), తాజా పాస్‌పోర్ట్ సైజు ఫోటో, మొబైల్ నంబర్లు, ఏజెంట్ వివరాలు (తెలిస్తే) తీసుకురావాలి. నామినీ / వారసులు / కుటుంబ సభ్యులు: డిపాజిటర్ మరణించిన పక్షంలో మరణ ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు లేదా కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం, నామినీ/వారసుని గుర్తింపు, బ్యాంక్ వివరాలు, సంతకం చేసిన బాండ్ కలర్ జిరాక్స్ తప్పనిసరి. ఒకవేళ డిపాజిటర్ బతికి ఉండి రాలేని స్థితిలో కుటుంబ సభ్యులు వస్తే అధీకృత లేఖ (ఆథరైజేషన్ లెటర్), సంబంధం రుజువు పత్రాలు అవసరం. ఏజెంట్ల ద్వారా అయితే: ప్రతి అసలు బాండ్ చూపిస్తూ కలర్ జిరాక్స్ సమర్పించాలి. ప్రతి బాండ్ గుర్తింపు సంఖ్యను వేర్వేరుగా నమోదు చేయడంతో పాటు ఏజెంట్ కోడ్, ఆధార్, పాన్, బ్యాంక్ పాస్‌బుక్ కాపీ, ఫోటో, మొబైల్ నంబర్ ఇవ్వాలి. **అసలు బాండ్లు అప్పగించనక్కర్లేదు:** బాధితులు తమ వద్ద ఉన్న అసలు (ఒరిజినల్) బాండ్లను అధికారులకు అప్పగించాల్సిన అవసరం లేదని సీఐడీ స్పష్టం చేసింది. కేవలం ధృవీకరణ కోసం చూపించి, బాండ్ నంబర్ సహా అన్ని వివరాలు స్పష్టంగా కనిపించే కలర్ జిరాక్స్‌పై సంతకం చేసి ఇస్తే సరిపోతుంది. సమర్పించిన పత్రాలకు అధికారులు రసీదు ఇస్తారు. మండలాల వారీగా కేటాయించిన తేదీల ప్రకారం బాధితులు కేంద్రాలకు రావాలని సీఐడీ కోరింది.

ప్రజా సమస్యలకు ప్రతిబింబం..ఆ కెమెరా కన్ను

● ఉత్తమ ఫోటోజర్నలిస్టుగా గడ్డం శ్రవణ్ కుమార్ ● బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో పురస్కారం ప్రదానం చేసిన అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్21: సమాజంలోని మార్పులను, ప్రజా సమస్యలను తన కెమెరా కంటితో కళ్లకు కట్టినట్లు ఆవిష్కరించిన నమస్తే తెలంగాణ ఫోటోజర్నలిస్ట్ గడ్డం శ్రవణ్ కుమార్ ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ స్టేట్ ఫోటోజర్నలిస్ట్స్ అసోసియేషన్ (టిఎస్పిజెఎ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ వార్తా ఛాయా చిత్రాల పోటీ2026లో ఆయన ఈ ఘనత సాధించారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతులమీదుగా శ్రవణ్ కుమార్ ఈ అవార్డును స్వీకరించారు. **బాధ్యత మరింత పెరిగింది: గడ్డం శ్రవణ్ కుమార్** పురస్కారం అందుకున్న అనంతరం శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ..ప్రజా సమస్యలను ప్రభుత్వం, సమాజం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తోడ్పడే వృత్తిలో ఉండటం తన అదృష్టమని పేర్కొన్నారు. ఈ అవార్డు తనపై బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులోనూ సామాజిక స్పృహ కలిగిన ఉత్తమ చిత్రాలను అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. తన ఎదుగుదలకు అండగా నిలిచిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు, ఫోటోజర్నలిస్టులు, మిత్రులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వేధింపులకు భయపడొద్దు

● ధైర్యంగా ఫిర్యాదు చేయండి ● మహిళల భద్రతకు షీ టీమ్స్ అండ

● విద్యార్థులకు ఎస్సై రమాదేవి అవగాహన



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్21: మహిళలు, బాలికల భద్రతకు షీ టీమ్స్ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని,ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని షీ టీం ఎస్సై రమాదేవి సూచించారు. ఎస్సీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు శనివారం కొత్తగూడెంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. రాగింగ్,ఈవ్ టీజింగ్,బ్లాక్‌మెయిలింగ్,అసభ్యకర సందేశాలు, తప్పుడు ఫోన్ కాల్స్, బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు ఎదురైతే మౌనంగా భరించకుండా తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బాధితుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచి రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఠాణాకు రాలేని బాధితుల వద్దకే షీ టీమ్స్ వెళ్లి సమస్యలను పరిష్కరిస్తాయని, ఫోన్, వాట్సాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. విద్యార్థినులు సామాజిక మాధ్యమాలను వినియోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. అనంతరం పోక్సో, బాల్య వివాహాల నిరోధక చట్టాలపై అవగాహన కల్పించి,అత్యవసర సమయాల్లో 112 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి సతీష్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సినిమా పైరసీ ముఠా గుట్టురట్టు..ఇద్దరి అరెస్ట్

- క్రిప్టో కరెన్సీలో చెల్లింపులు..

బెట్టింగ్ యాప్‌ల ప్రచారం

- వివరాలు వెల్లడించిన టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్21: కొత్త సినిమాలను థియేటర్లలో అక్రమంగా రికార్డు చేసి, ఆన్‌లైన్‌లో పంపిణీ చేస్తున్న సినిమా పైరసీ నెట్‌వర్క్ గుట్టును తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) ఛేదించింది. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు సిటీ స్క్వేర్ మాల్‌లో ఉన్న ఎస్‌వీసీ సినిమాస్ థియేటర్‌లో కొత్తగా విడుదలైన సినిమాలను నిందితులు మొబైల్ ఫోన్‌ల ద్వారా అక్రమంగా చిత్రీకరించేవారు. అనంతరం ఆ వీడియోలను పైరసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేవారని విచారణలో తేలింది. ప్రధాన నిందితుడు టెలిగ్రామ్ ద్వారా వీరితో సంప్రదింపులు జరుపుతూ, రికార్డు చేసిన చిత్రాలను పైరసీ వెబ్‌సైట్లు,టెలిగ్రామ్ ఛానళ్ల ద్వారా పంపిణీ చేసేలా సమన్వయం చేసినట్లు గుర్తించారు. ప్రతి సినిమా రికార్డింగ్‌కు నిందితులకు రూ. 20వేలు చొప్పున క్రిప్టోకరెన్సీ రూపంలో కమీషన్ చెల్లించగా ఆ మొత్తాన్ని వారు భారతీయ కరెన్సీ (ఐఎన్ఆర్)లోకి మార్చుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. అలాగే పైరసీ వెబ్‌సైట్లలో ప్రకటనలు, లింకుల ద్వారా ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేస్తూ అక్రమంగా ఆర్జిస్తున్నట్లు గుర్తించారు. ఈ కేసులో సంతోష్ నగర్‌కు,కప్పల నగర్‌కు చెందిన (19)సంవత్సరాల వయసున్న ఇద్దరి నిధితులను నవంబర్ 20న అరెస్ట్ చేశారు. ఇద్దరూ విద్యార్థులేనని, వీరి వద్ద నుంచి సినిమాల రికార్డింగ్‌కు ఉపయోగించిన మూడు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రామాయణ,సీన్,మహాశక్తి,ఆకాశంలో ఓ తార,కల్ట్,ఆదర్శ కుటుంబం తదితర కొత్త సినిమాలను ఇలా రికార్డు చేసినట్లు విచారణలో గుర్తించారు. టీజీసీఎస్బీ, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) మధ్య ఒప్పందం మేరకు 2026 జనవరి 5న యాంటీ పైరసీ యూనిట్ (ఏపీయూ) ఏర్పాటైంది. అప్పటి నుంచి అడ్వాన్స్‌డ్ టేక్ డౌన్ టూల్స్, వెబ్ నిఫా ద్వారా 42,151 పైరసీ సంబంధిత యూఆర్ఎల్‌లను బ్లాక్ చేసినట్లు శిఖా గోయల్ పేర్కొన్నారు. ప్రధాన హోస్టింగ్ సర్వర్లకు 87 నోటీసులు జారీ చేశామని, 8 మంది అనుమాని తులను గుర్తించి ఐదుగురిని అరెస్ట్ చేశామని తెలిపారు. గత ఏడు నెలల్లో 20కి పైగా సినిమాలకు సంబం ధించిన పైరసీ చర్యలను అడ్డుకోవడం ద్వారా సుమా రు రూ. 33.6 కోట్ల నష్టాన్ని నివారించ గలిగామని వెల్లడించారు. పైరసీ వల్ల సినీ రంగానికి ఆర్థిక నష్టంతో పాటు బెట్టింగ్, జూదం, సైబర్ మోసాలకు వేదికలుగా మారుతున్నాయని శిఖా గోయల్ హెచ్చరించారు. సినిమాటోగ్రాఫ్ చట్టం– 2023 (సవరించిన), ఐటీ చట్టంలోని నిబంధనల ప్రకారం జైలు శిక్షతో పాటు జరిమానాలు విధించే అవకాశం ఉందని, నెట్‌వర్క్‌లోని మిగిలిన వ్యక్తుల కోసం దర్యాప్తు కొనసాగుతోందని ఆమె స్పష్టం చేశారు.

ప్రతి బాలికకు స్వీయరక్షణ ఆత్మవిశ్వాసం అవసరం

- ధీరా ఐదవ విడత శిక్షణకు విశేష స్పందన

- 5 వేల మందికి పైగా విద్యార్థినులకు శిక్షణ

- మల్కాజిగిరి సీపీ బి.సుమతి

- కుషాయిగూడలో 750 మందికి పైగా బాలికల భాగస్వామ్యం

- 7 సబ్‌డివిజన్లలో ఒక్కో పాఠశాల ఎంపిక

- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో తుది వేడుక

- ఆపదలో 112కు వెంటనే ఫోన్ చేయాలని విద్యార్థినులకు సూచన





తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబరు21: విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం,శారీరక దృఢత్వం సాధించడం, వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ మహిళా భద్రతా విభాగం నిర్వహిస్తున్న ధీరా స్వీయరక్షణ, మార్షల్ ఆర్ట్స్ శిక్షణ కార్యక్రమం శనివారం కుషాయిగూడలోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ (బాలికలు)లో ఘనంగా జరిగింది.ఐదవ విడతగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 750 మందికి పైగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి, ఐపీఎస్ మాట్లాడుతూ..ప్రతి బాలిక తనను తాను రక్షించుకునే ఆత్మవిశ్వాసాన్ని కలిగి ఉండాలని ఆకాంక్షించారు.మహిళలు, చిన్నారుల రక్షణ,సంక్షేమం కోసం భరోసా కేంద్రాలు,షీ టీమ్స్, సీడీఈడబ్ల్యూ కుటుంబ సలహా కేంద్రాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ),మహిళా పోలీస్ స్టేషన్ల ద్వారా సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.స్వీయరక్షణ కేవలం శారీరక బలానికే పరిమితం కాదు అని చెప్పారు. మానసిక చురుకుదనం,సమస్యలను ధైర్యంగా చెప్పుకోగలగడం కూడా అంతే ముఖ్యం అని ఆమె తెలిపారు.ఆపదలో 112కు వెంటనే ఫోన్ చేసి పోలీసుల సాయం తీసుకోవాలి అని సూచించారు.**5 వేల మందికి పైగా శిక్షణ..స్టేడియంలో ప్రదర్శన:**కమిషనరేట్ పరిధిలోని ఏడు సబ్‌డివిజన్లలో ఒక్కో పాఠశాలను ఎంపిక చేసి, 5 వేల మందికి పైగా విద్యార్థినులకు క్రమబద్ధమైన స్వీయరక్షణ శిక్షణ ఇస్తామని సీపీ వెల్లడించారు.అనంతరం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ప్రత్యేక వేదిక నిర్వహించి, విద్యార్థినుల ప్రదర్శనలను పరిశీలించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలను గుర్తిస్తామని చెప్పారు. పీఈటీలు సిద్ధం చేసిన స్వీయరక్షణ వీడియోల ద్వారా విద్యార్థినులు నిత్యం సాధన చేసేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. గత ఏడు నెలల్లో కమిషనరేట్ పరిధిలో దాదాపు 335 దుర్వినియోగ కేసులు నమోదైన నేపథ్యంలో విద్యార్థినులు, తల్లిదండ్రులు, సమాజంలో మరింత అవగాహన, తమ హక్కులపై స్పష్టత అవసరమని సూచించారు.**ఇప్పటివరకు జరిగిన 'ధీరా' కార్యక్రమాలు:** తొలి విడత: ఆగస్టు 13నమునగానూరులోని ఎంజేపీటీ బీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్/కాలేజీలో ధీరా కార్యక్రమం ప్రారంభం అయింది.రెండవ విడత: కీసరలో నిర్వహణ; 2,533 మంది బాలికల భాగస్వామ్యం.మూడవ విడత: సెప్టెంబర్ 11న అంకుశాపూర్ ఎంజేపీటీ బీసీడబ్ల్యూ స్కూల్/కాలేజీలో 2,500 మందికి పైగా విద్యార్థినులతో (జగద్గిరిగుట్ట సైనిక్ స్కూల్, బుద్వేల్, మహేంద్ర హిల్స్ టీజీఎస్‌డబ్ల్యూఆర్ డిగ్రీ కాలేజీలు) నిర్వహణ జరిగింది.నాలుగవ విడత: నవంబర్ 3న చైతన్యపురి టీజీఎస్‌డబ్ల్యూఆర్ మహిళా డిగ్రీ, లా కాలేజీలో 900 మందికి పైగా విద్యార్థినుల భాగస్వామ్యం.ఈ కార్యక్రమంలో టీఎంఆర్‌సీ ప్రిన్సిపాల్ సునీతా రాణి మాట్లాడుతూ..ఈ శిక్షణ విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరమని అభినందించారు.మహిళా భద్రతా విభాగం డీసీపీ టి. ఉషారాణి, ఉప్పల్ జోన్ అదనపు డీసీపీ ఎన్. వెంకటరమణ, ఏసీపీలు పి. వెంకటేశ్వర్లు, వెంకట్ రెడ్డి, కరాటే మాస్టర్ (8వ డాన్ బ్లాక్ బెల్ట్) వసంత్ కుమార్, కుషాయిగూడ సీఐ భాస్కర్ రెడ్డి, షీ టీమ్స్ ఇన్‌స్పెక్టర్ జి. అంజయ్య, ఎస్సై యాదగిరి రెడ్డి, ఉప్పల్ షీ టీమ్ ఇన్‌చార్జి నళినీ కుమారి వార్సీ, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ మీడియా కమిటీ వైస్ చైర్మన్‌గా వెంకటరమణ



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో-తొర్రూరు ప్రతినిధి(సాంబ పస్తం),నవంబర్21: ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మీడియా కమిటీ వైస్ చైర్మన్‌గా తొర్రూరు పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు బిజ్జాల వెంకటరమణ నియమితులయ్యారు.ఈ మేరకు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ నియామక ఉత్తర్వులు జారీ చేయగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొద్దుటూరి గౌరీశంకర్ ఆ పత్రాన్ని వెంకటరమణకు అందజేశారు.గత మూడు దశాబ్దాలుగా మీడియా రంగంలో క్రియాశీలకంగా పనిచేస్తూ, ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం సుదీర్ఘకాలంగా కృషి చేస్తున్నందున రాష్ట్ర నాయకత్వం ఈ బాధ్యతలు అప్పగించింది.ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ..ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి, సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు మీడియాలో విస్తృత ప్రచారం కల్పించేందుకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు గౌరీశంకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిజ్జాల అనిల్, చిదిరాల రవి, చిదిరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి..: వార్డ్ కౌన్సిలర్ రేషపల్లి నవీన్



తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 21: ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేయడమే తన కర్తవమని వార్డు కౌన్సిలర్ రేషపల్లి నవీన్ అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని 18వ వార్డులో నూతన సీసీ రోడ్డు పనులకు శనివారం స్థానిక వార్డు సిపిఐ పార్టీ కౌన్సిలర్ రేషపల్లి నవీన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 వ వార్డు పరిధిలోని బైపాస్ రోడ్డు నందు నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు దగ్గర రోడ్డు లేక ఎన్నో సంవత్సరాల నుండి ఆ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతూ స్కూలుకు వెళ్లే విద్యార్థులు, ప్రజలు సరైన రోడ్డు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడేవారని, వర్షాకాలంలో ఈ ప్రాంతం బురదమయమై ప్రజలు అష్ట కష్టాలు పడేవారని ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష మేరకు తనపై నమ్మకంతో ఎన్నికలు గెలిపించినందుకు కృతజ్ఞతగా వారికి సేవ చేసే భాగ్యము కనిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. దానిలో భాగంగానే ఈ ప్రాంతంలో నూతన సిసి రోడ్డు పనులను చేపట్టినట్టు తెలిపారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల వంచగానే మిగిలింది తప్ప ఇక్కడ రోడ్డు నిర్మాణం చేయకపోవడం చాలా బాధాకరమంటూ నాపై నమ్మకం పెట్టి కష్టపడి పని చేస్తాడంటూ ప్రజలు నన్ను ఆశీర్వదించినట్టుగానే నన్ను గెలిపించినందుకు ఓటర్లకు ఇచ్చిన మాట తప్పకుండా మున్సిపల్ నిధుల నుండి ఈ ప్రాంతంలో రోడ్డు వేయడం జరిగిందంటూ ప్రజలు నాపై పెట్టినటువంటి నమ్మకాన్ని వమ్ము చేయకుండా 18 వ వార్డు అభివృద్ధి చేయడంలో వార్డ్ ప్రజల ఆశీర్వాదంతో చేయడం జరుగుతుందని 18 వ వార్డు నుండి హౌసింగ్ బోర్డ్ ప్రాంతానికి వెళ్లే వారికి కానీ ఇక్కడ ఉన్నటువంటి రవణమార్గంగా పోవాలంటే భయపడేవారు సిసి రోడ్డు నిర్మాణం తర్వాత ఈ ప్రాంత ప్రజలు రవాణా మార్గంగా రాకపోకలు జరుగుతుందని వారన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వార్డు ప్రజలు ఇక్కడ రోడ్డు వేయడం సంతోష దాయకమైన విషయం అంటూ వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జంగిలి అనిల్ ,గోరంట్ల సతీష్, ఆకారపు రాము, తల్లాడ శ్రీను, నర్సింగ అశోక్ ,మంద అభిలాష ,మొగిలి విష్ణువర్ధన్, పొల్లుదాసు దేవదానం... కాంట్రాక్టర్ ఆలకుంట్ల మల్లేష్.. మంజునాథ.తదితరులు పాల్గొన్నారు.

నిధుల్లేక ఆ సర్వే నిలిపివేసిన లైసెన్స్ సర్వేయర్లు

●పెండింగ్ వేతనాలు చెల్లించాలని, పారితోషికం పెంచాలని డిమాండ్



తొలి అక్షరం/పెద్దవంగర, నవంబర్ 21:

పెండింగ్ నిధుల విడుదల, వేతన సవరణ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని లైసెన్స్ సర్వేయర్లు మూడు రోజులుగా రీ సర్వే పనులను నిలిపివేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీనియర్ లైసెన్స్ సర్వేయర్ గంధం జంపయ్య మాట్లాడుతూ.. గత ఎనిమిది నెలలుగా విధులు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయిలో వేతనాలు అందడం లేదన్నారు. కొందరికి కేవలం రూ.5 వేలే చెల్లించారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు రూ.60 పారితోషికాన్ని పెంచాలని, పూర్తయిన గ్రామాల పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు.ప్రభుత్వ భూములు, ప్రైవేటు స్థలాల సర్వేకు, కార్యాలయ రికార్డులు, డేటా ఎంట్రీ, మ్యాపుల తయారీకి ప్రత్యేక పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా అమలు వివరాలు వెల్లడించి ప్రతి సర్వేయర్‌కు బీమా రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లైసెన్స్ సర్వేయర్లు బసనబోయిన కుమార్, గుర్రం సతీష్, తలారి జీవన్, చర్లపల్లి లివిత్, ఎద్దు విజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం: గోశిక వినయ్ కుమార్ చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్

తొలి అక్షరం /చౌటుప్పల్ నవంబర్ 21: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని చౌటుప్పల్ పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేసారు.కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అండగా నిలవడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హతలు, దరఖాస్తు విధానం, పథక నిబంధనలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, అవసరమైన వివరాల కోసం సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు.

కొందుర్గులో అభివృద్ధి పనులకు శ్రీకారం

- బ్రిడ్జిల ప్రారంభం.. సంక్షేమ పథకాలు ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్

తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 21: కొందుర్గు మండలంలోని పలు గ్రామాల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ శనివారం పర్యటించి అభివృద్ధి పనులను ప్రారంభించారు.పులుసుమామిడిమహదేవ్‌పూర్ మధ్య రూ.50 లక్షలతో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జి, ఉత్తరాసుపల్లిలో రూ.కోటితో నిర్మించిన రెండు బ్రిడ్జిలు, ముట్పూర్‌లో రూ.50 లక్షలతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. తేకులపల్లిలో బ్రిడ్జితో పాటు రూ.12 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అనిత జితేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



చెకుముకి సైన్స్ సంబరాల్లో సెయింట్ థెరిస్సా విద్యార్థుల ప్రతిభ

- టాలెంట్ టెస్ట్‌లో సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులు





తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 21: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల్లో సెయింట్ థెరిస్సా హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్లు సాధించారు. మాలోత్ భరత్ కుమార్, బి. సహస్రలక్ష్మి, ఎస్. రిషి, బానోతు రాంచరణ్ తదితరులు టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నారు.విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ చల్లా మమత యాకూబ్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించి మరింత ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు గొడుగుల శ్రీకాంత్, ముత్తినేని రమేష్, లావణ్య, సుధాకర్, మాలోత్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరైన ప్రముఖులు

- కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 21: వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణంలోని 7వ వార్డు సభ్యుడు మహమ్మద్ అమీర్ సోదరుడు మహమ్మద్ సలీం నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకకు సూరిపల్లి సొసైటీ చైర్మన్ మాదటి శ్రీనివాస్, మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.నర్సంపేట కోర్టు ఏజీపీ బండి శివకుమార్, సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి, మైనారిటీ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అన్వర్, యూత్ కాంగ్రెస్ నాయకులు బూర్గు నరేష్, బాల్నే ప్రశాంత్, బట్టు రాము తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ బస్టాండ్ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

- ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచన



తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 21: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని బస్టాండ్ అభివృద్ధి పనులను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరిశీలించారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి గ్రౌండ్ లెవలింగ్, మిగిలిన సీసీ పనులు, నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు.ప్రయాణికులు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేసి, బస్టాండ్‌ను అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే సీసీ ప్లాట్‌ఫాంల నిర్మాణం చేపట్టగా, మిగిలిన పనులను కూడా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యం: బత్తిని సహదేవ్ గౌడ్



తొలి అక్షరం/వలిగొండ, నవంబర్ 21: అర్హులైన ప్రతి కుటుంబం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్ సూచించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పథకం ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా భరోసా కల్పించడమే పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పథకం అర్హతలు, దరఖాస్తు విధానం, నిబంధనలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా.. అర్హులందరూ నమోదు చేసుకోవాలి

- ఆదివారం సెలవు రోజైనా అన్ని వార్డుల్లో అందుబాటులో మున్సిపల్ సిబ్బంది
- చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 21: చౌటుప్పల్ పట్టణంలోని రేషన్ కార్డులు కలిగిన అర్హులైన కుటుంబాలన్నీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ కోరారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చొరవతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా కల్పించనున్నట్లు తెలిపారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఆదివారం సెలవు రోజైనా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో అధికారులు, వార్డు ఇన్‌చార్జులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అర్హులైన కుటుంబాలు తమ వార్డు కార్యాలయాన్ని సంప్రదించి రేషన్ కార్డు, ఆధార్ కార్డులతో బీమా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

- క్రీడాకారులు పట్టుదలతో సాధన చేయాలి.. తహసీల్దార్ రమేష్ బాబు



తొలిఅక్షరం/సర్పంహులపేట నవంబర్ 21: క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేసి రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలని తహసీల్దార్ రమేష్ బాబు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్-14 విభాగంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైన 14 మంది క్రీడాకారులకు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని అభినందించారు.జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బండి రమేష్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారులతో కరచాలనం చేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శనతో జిల్లా కీర్తిని పెంచాలని, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీలు కొమురయ్య, శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ నామినేటెడ్ నియామకాలపై హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

- రాజకీయ ప్రయోజనాల కోసం సహకార సంఘాలను వాడుకోవడం సరికాదు
- చౌటుప్పల్ పట్టణ బీఆర్ఎస్ పట్టణ నాయకుడు సూర్కంటి శంకర్ రెడ్డి



తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 21: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)లో నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్ల నియామకాలు చెల్లవని హైకోర్టు స్పష్టం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ అని బీఆర్ఎస్ చౌటుప్పల్ పట్టణ నాయకుడు సూర్కంటి శంకర్ రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించకుండా రాజకీయ ప్రయోజనాల కోసం నామినేటెడ్ నియామకాలు చేపట్టడం సరైన విధానం కాదన్నారు. పీఏసీఎస్ ఎన్నికల తేదీలను రెండు వారాల్లోగా ప్రకటించాలని హైకోర్టు ఆదేశించడం హర్షణీయమన్నారు.ఎన్నికలు నిర్వహించకపోతే ప్రస్తుత చైర్మన్లే కొనసాగుతారని న్యాయస్థానం స్పష్టం చేయడం ప్రజాస్వామ్య విలువలకు బలం చేకూరుస్తుందన్నారు. రైతులకు సంబంధించిన సహకార సంఘాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చే ప్రయత్నాలను సహించేది లేదని పేర్కొన్నారు.ప్రభుత్వం రాజకీయ జోక్యాన్ని పక్కనపెట్టి హైకోర్టు ఆదేశాల మేరకు వెంటనే పీఏసీఎస్ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని, రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూర్కంటి శంకర్ రెడ్డి డిమాండ్ చేశారు.

శివ స్వాములకు అన్నప్రసాద వితరణ చేసిన ఆంబోత్ శంకర్ నాయక్ మంగమ్మ దంపతులు

- కార్తీకమాసంలో అన్నదాన సేవ చేయడం మా అదృష్టం: కుటుంబ సభ్యులు



తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 21: చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డులో గల నూతన శివాలయం శ్రీ మోక్ష లింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా శివమాల ధరించిన శివ స్వాములకు నారాయణపురం మండలం రాధానగర్ తండాకు చెందిన ఆంబోత్ శంకర్ నాయక్, మంగమ్మ దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్తీకమాసంలో శివమాల ధరించిన శివ స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. భగవంతుని ఆశీస్సులతో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు రాంచరణ్, గీతామాదురి, లక్ష్మణ్ చరణ్, రవళి, పవన్ చరణ్, అధ్యాశక్తితో పాటు గురుస్వాములు ఆదిమూలం శంకర్, వీరమల్ల దాసు గౌడ్, కుక్కల నరసింహ, గోగులోతు శంకర్ నాయక్, బోయిని నరసింహ యాదవ్, దోర్నాల గజేందర్, ముప్పిడి కృష్ణ, కందగట్ల కృష్ణ, పున్న శివ, భీమనగొని బాలశివ తదితర శివ స్వాములు పాల్గొన్నారు.

పీఏసీఎస్ నామినేటెడ్ నియామకాలపై హైకోర్టు తీర్పు

కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ!

ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరించిన ప్రభుత్వానికి న్యాయస్థానం తీర్పు చెంపపెట్టు.

ఢిల్లీ మాధవరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ చౌటుప్పల్ మండల సీనియర్ నాయకులు



తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 21: తెలంగాణలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)లో నామినేటెడ్ పదవుల నియామకాలపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బగా నిలిచిందని బీఆర్ఎస్ మండల నాయకులు ఢిల్లీ మాధవరెడ్డి పేర్కొన్నారు.పీఏసీఎస్‌లలో నామినేటెడ్ పదవుల నియామకాలు చెల్లవని హైకోర్టు స్పష్టం చేయడంతో పాటు, రెండు వారాల్లోగా ఎన్నికల తేదీలను ప్రకటించాలని ఆదేశించడం ప్రజాస్వామ్య ప్రక్రియకు ప్రాధాన్యతనిచ్చినట్ల యిందన్నారు. ఒకవేళ ఎన్నికలు నిర్వహించకపోతే ప్రస్తుతం ఉన్న చైర్మన్లే యథావిధిగా కొనసాగుతారని న్యాయస్థానం స్పష్టం చేసిందని తెలిపారు.ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి రైతులకు ప్రాతినిధ్యం కల్పించాల్సిన ప్రభుత్వం, నామినేటెడ్ విధానంలో పదవులను భర్తీ చేయాలని ప్రయత్నించడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. హైకోర్టు తాజా తీర్పు ప్రభుత్వ నిర్ణయంపై న్యాయపరమైన స్పష్టతను ఇచ్చిందని, ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక చెంపపెట్టుగా భావిస్తున్నామని ఢిల్లీ మాధవరెడ్డి పేర్కొన్నారు.ఇకనైనా ప్రభుత్వం కోర్టు ఆదేశాలను గౌరవించి పీఏసీఎస్ ఎన్నికల నిర్వహణకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

చౌటుప్పల్ కాంగ్రెస్ 7, 12వ వార్డులకు నూతన అధ్యక్షుల ఎన్నిక!

- 7వ వార్డుకు లందగిరి యాదయ్య.. 12వ వార్డుకు జాజుల శివకుమార్ గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక





తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 21: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచనలు, డీసీసీ ఆదేశాల మేరకు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వార్డు, బూత్ కమిటీల ఏర్పాటు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా 7వ వార్డు అధ్యక్షుడిగా లందగిరి యాదయ్య, 12వ వార్డు అధ్యక్షుడిగా జాజుల శివకుమార్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోషిక వినయ్, ఆకుల ఇంద్రసేనారెడ్డి, పాక చిరంజీవి యాదవ్, బద్రి గాలయ్య, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెకుముకి పరీక్షలో ఫాదర్ కొలంబో విద్యార్థులకు మూడో స్థానం

- బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు



తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 21: వరంగల్ జిల్లా నెక్కొండ మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలో ఫాదర్ కొలంబో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి మూడో ర్యాంకు సాధించారు. జే. గౌతమ్, ఈ. అర్చన, సాయి తేజ బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్నారు.విద్యార్థుల ప్రతిభను పాఠశాల ప్రిన్సిపల్ మెట్టు శ్రవణ్ రెడ్డి అభినందించారు. పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేసిన ఉపాధ్యాయులు కే. సతీష్, రమేష్‌లను ప్రశంసించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ థామస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ సమగ్ర అభివృద్ధికి విజ్ఞాన శాస్త్రమే పునాది

- నెక్కొండ ఎంఈఓ బి. రవికుమార్.





తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 21: వరంగల్ జిల్లా నెక్కొండలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ 42 మంది విద్యార్థుల ప్రతిభ జిల్లా స్థాయికి మూడు జట్లు ఎంపికసమాజ సమగ్ర అభివృద్ధికి విజ్ఞాన శాస్త్రం పునాది అని, విద్యార్థులు చిన్ననాటి నుంచే శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని నెక్కొండ మండల విద్యాశాఖాధికారి బి. రవికుమార్ అన్నారు. ప్రతి విషయాన్ని ప్రశ్నిస్తూ, పరిశీలిస్తూ, కారణాలను విశ్లేషిస్తూ వాస్తవాలను తెలుసుకునే దృక్పథం విద్యార్థుల్లో పెంపొందాలని పేర్కొన్నారు. విజ్ఞాన శాస్త్రం కేవలం పాఠ్యాంశానికో, పరీక్షలకో పరిమితం కాకుండా నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గాలను చూపే సాధనంగా మారాలని ఆకాంక్షించారు.జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం నెక్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి మానవ జీవన విధానంలో అనేక మార్పులు తీసుకొస్తోందని, ఆ మార్పులకు అనుగుణంగా విద్యార్థులు విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావనలకు దూరంగా ఉంటూ హేతుబద్ధమైన ఆలోచనలతో ముందుకు సాగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. సైన్స్ టాలెంట్ టెస్ట్ మండల కన్వీనర్ బూరుగుపల్లి శ్రవణ్ కుమార్,మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం అనేది కేవలం విజ్ఞాన శాస్త్రానికే పరిమితమైన అంశం కాదని, అది మనిషి ఆలోచనా విధానాన్ని, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని, సామాజిక బాధ్యతను ప్రభావితం చేసే గొప్ప లక్షణమని అన్నారు. ప్రకృతిలో జరిగే ప్రతి పరిణామం వెనుక ఒక శాస్త్రీయ కారణం ఉంటుందని, వాటిని తెలుసుకునే ఆసక్తి విద్యార్థుల్లో పెంపొందించాలని పేర్కొన్నారు. విజ్ఞాన శాస్త్రాన్ని సమాజ అవసరాలకు అనుసంధానం చేసినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు.జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పాక శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిలో పరిశీలనా శక్తి, సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఇటువంటి విజ్ఞాన కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అనుముల శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని కూడా సంపాదించాలని, శాస్త్రీయ అవగాహన కలిగిన భావి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనుముల శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన పాఠశాల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎంపికైన 42 మంది విద్యార్థులు మండల స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. పోటీల అనంతరం ప్రతిభ కనబరిచిన మూడు జట్లను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమరయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఆర్థిక సహాయం, కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలి: దయ్యాల శ్రీనివాస్





తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 21: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి దయ్యాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.పెద్ద కొర్పోల్ కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దొడ్డి కొమరయ్య కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించి, ప్రభుత్వ పరంగా ప్రత్యేక గుర్తింపు, గౌరవం కల్పించాలని కోరారు. అర్హతను బట్టి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతో పాటు జీవనోపాధి కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా వారి కుటుంబాలను ఆదుకోవడం కూడా ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.ఈ సమావేశంలో కురుమ సంఘం నాయకులు దయ్యాల వీరమల్లు, సారిగొల్ల దయ్యాల కట్టయ్య, జీఎంపీఎస్ మండల అధ్యక్షుడు కోరే యాదగిరి, బిక్షపతి, బుడిగొండ కుమారస్వామి, చంద్రయ్య, వీరస్వామి, వెంకన్న, దయ్యాల రామచంద్రు, అనిల్, బాలకొమురు, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

- జిల్లా స్థాయికి ఎంపికైన నెల్లికుదురు విద్యార్థులు





తొలి అక్షరం/నెల్లికుదురు, నవంబర్ 21: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎల్టా ఇంగ్లీష్ పోటీలు, చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.ఎల్టా పోటీల్లో సీనియర్ విభాగంలో ఎస్. దీక్షిత్, జూనియర్ విభాగంలో పి. అయాన్, ఎడ్యుటాక్ విభాగంలో పి. సిరివెన్నెల విజేతలుగా నిలిచారు. చెకుముకి సైన్స్ పోటీల్లో జి. ప్రణీత, జి. అమృతవర్షిణి, పి. అయాన్‌ల బృందం ప్రథమ స్థానం సాధించింది.విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ జి. ఉపేందర్ రావు అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ విజయం సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న సర్పంచ్

- కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన పెండ్యాల హరిప్రసాద్



తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 21: వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణంలోని రెండో వార్డు బీసీ కాలనీలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణ, జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొనిజేటి బిక్షపతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగం ప్రశాంత్, మార్కెట్ డైరెక్టర్ బొమ్మరబోయిన రమేష్ యాదవ్, వార్డు సభ్యుడు దేవనబోయిన విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ బస్టాండ్ ఆధునీకరణకు చర్యలు చేపట్టాలి

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి: ఎమ్మెల్యే దొంతి





తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 21: వరంగల్ జిల్లా నెక్కొండ బస్టాండ్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. టీజీ ఆర్టీసీ ఈడీ రాజశేఖర్, కరీంనగర్ జోన్ ఈడీ సోలేమన్‌లతో కలిసి బస్టాండ్‌ను పరిశీలించారు.ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్టీసీ ఇంజినీరింగ్ విభాగం చీఫ్ ఇంజినీర్ కవితకు సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న సీసీ ప్లాట్‌ఫాం పనులను పరిశీలించి, అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, కాంగ్రెస్ నాయకులు, ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిరాజ్ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న బీజేపీ మండల అధ్యక్షుడు చందు రాజ్



తొలి అక్షరం/నెల్లికుదురు, నవంబర్ 21:నెల్లికుదురు మండలం స్థానిక కేంద్రంలో నిన్న జరిగిన ముదిరాజ్ సంఘం మండల శాఖ ఆహ్వానం వరకు మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ముదిరాజులు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని అదేవిధంగా చట్టసభల్లో ముదిరాజులకు న్యాయం జరిగే విధంగా పోరాటం చేయాలని పోరాటంలో మా మద్దతు తప్పకుండా ఉంటుందని తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ బీసీ డీ లోగల ముదిరాజులను బీసీ ఏలకు మార్చాలని లేకపోతే పోరాటం చేస్తామని చెప్పడం జరిగింది. ముదిరాజుల అభివృద్ధి కోసం బీజేపీ ముందు ఉంటుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు కుక్కల ఐలయ్య, పట్టణ కేంద్రంలో గల కోల సోమయ్య ,కళాధర్, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల మహా పాదయాత్రను విజయవంతం చేయండి

- మండలాధ్యక్షుడు నోముల శంకర్ పిలుపు



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 21: ఈ నెల 22న ఆదివారం ఉదయం 11 గంటలకు మేడారంలోని జంపన్న వాగు నుంచి సమ్మక్కసారలమ్మ గద్దెల వరకు నిర్వహించనున్న ఉద్యమకారుల మహా పాదయాత్రను విజయవంతం చేయాలని రామన్నపేట మండలాధ్యక్షుడు నోముల శంకర్ కోరారు.ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చాలని, డిసెంబర్ 9లోగా వెబ్‌సైట్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పాదయాత్ర అనంతరం మేడారంలో ఉద్యమకారుల కార్యాచరణపై భారీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 33 జిల్లాల ఉద్యమకారులు, మహిళా ఉద్యమకారులు, మండల కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రేషన్ దుకాణం డీలర్‌పై 6ఏ కేసు నమోదు

6.84 క్వింటాళ్ల సరుకులు స్వాధీనం: పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్

తొలి అక్షరం,ఖమ్మం, జిల్లా ప్రతినిధి/ నవంబర్ 21: ఖమ్మం పట్టణంలోని చౌకధరల దుకాణం నంబర్ 2281001లో అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలడంతో డీలర్ ఎం. రాజయ్యపై నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం 6ఏ కేసు నమోదు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్ తెలిపారు.డీలర్ అక్రమాలపై వీడియో ఆధారాలతో ఫిర్యాదు అందడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణంలో ఉన్న 6.84 క్వింటాళ్ల సరుకులను స్వాధీనం చేసుకుని, భద్రత నిమిత్తం సమీపంలోని మరో రేషన్ దుకాణానికి అప్పగించారు.రేషన్ సరుకులను పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవకతవకలు గుర్తిస్తే ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేయాలని చందన్ కుమార్ కోరారు.

హామీల అమలుకు మేడారం నుంచి ఉద్యమ శంఖారావం

- మహా పాదయాత్ర అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటన



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 21: ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న మేడారంలో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న తెలిపారు.ఆదివారం ఉదయం 11 గంటలకు జంపన్న వాగు నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర సమ్మక్కసారలమ్మ గద్దెల వద్ద ముగుస్తుందని చెప్పారు. అనంతరం భారీ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, డిసెంబర్ 9లోగా వెబ్‌సైట్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో జాప్యం చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాసరావు నాయకత్వంలో జరిగే పాదయాత్రకు 33 జిల్లాల నుంచి ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం

- కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది: జగదీశ్‌రెడ్డి



తొలి అక్షరం/నల్గొండ, నవంబర్ 21: కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. నల్గొండలోని బీఆర్ఎస్ కార్యాలయం లో నిర్వహించిన మీడియా సమావే శంలో ఆయన మాట్లాడారు.నాగార్జునసాగర్‌లో ఏపీ అక్రమ సొరంగం నిర్మిస్తున్నా ఎనిమిది నెలలుగా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఏపీ 290 టీఎంసీలకు పైగా నీటిని వినియోగించుకుంటుంటే తెలంగాణకు 40 టీఎంసీలు కూడా దక్కలేదని ఆరోపించారు. తెలంగాణ 128 టీఎంసీలు వాడిందన్న లెక్కలపై ప్రాజెక్టుల వారీగా వివరాలు, ప్రభుత్వం రాసిన లేఖలు, జీవోలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.సాగర్ ఎడమ కాలువ ఎండిపోగా, కుడి కాలువ కింద ఏపీ పంటలు సాగు చేసుకుంటోందని అన్నారు. డీ-25, డీ-37, డీ-38, డీ-40 కాలువల ఆయకట్టుకు నీరు అందడం లేదని విమర్శించారు. సాగర్‌లో మిగిలిన నీటిని కాపాడటంతో పాటు ఏపీ సొరంగం నిర్మాణాన్ని అడ్డుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

- ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి: జడ్జి రత్నకుమారి



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 21: మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని రామన్నపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. రత్నకుమారి విద్యార్థులకు సూచించారు.రామన్నపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా, మండల న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తి ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. బాధితులను నిర్లక్ష్యం చేయకుండా కౌన్సెలింగ్, వైద్య సహాయం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఏ. మజీద్, ఎక్సైజ్ ఎస్ఐ అరుణ్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు శేషాచారి, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన దైద రవీందర్

- వివాహ వేడుకలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 21: నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గోనె నరసింహారావు, నాగమణి దంపతుల కుమార్తె వివాహ వేడుకలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేటలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 21:రామన్నపేట మండల కేంద్రంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా కార్యాలయం ముందు జెండా ఆవిష్కరించిన కందుల హనుమంతు ఈ సందర్భంగా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు .కందుల హనుమంతు .మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయము వస్తుందంటే మత్స్యకారులవల్లే అని ఆయన అన్నారు మత్స్యకారులకు కుటుంబాల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ మత్స్య సంపద మీద ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు చేప పిల్లలు పంపిణీ చేయాలని వలలు తేప్పలు ఐస్ బాక్సులు బులోరా వెకిల్ సబ్సిడీ ద్వారా అందించి అన్ని విధాలుగా మచ్చకారులను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి పిట్టలమచ్చ గిరి మాజీ డైరెక్టర్ యాట ఇస్తారి బచ్చ రాములు రేపాక పోచమ్మ కేశ బోయిన మంగమ్మ భైరబోయిన శోభ యాట భాగ్యమ్మ యాట అనసూయ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించాలి

- సైన్స్ ప్రదర్శనలు ఆవిష్కరణలకు పునాదులు: ఎమ్మెల్సీ, కలెక్టర్





తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 21: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో సైన్స్ ఫెయిర్లు కీలకమని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు.శనివారం అనంతారం మోడల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను వారు సందర్శించి విద్యార్థులు రూపొందించిన నమూనాలు, ప్రయోగాత్మక ప్రాజెక్టులను పరిశీలించారు. ప్రతి అంశాన్ని ప్రశ్నిస్తూ కొత్త విషయాలను నేర్చుకోవాలని, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ విద్యార్థుల్లోనూ అపార ప్రతిభ ఉందని, సరైన ప్రోత్సాహం కల్పిస్తే అద్భుత ఆవిష్కరణలు సాధ్యమని ఎమ్మెల్సీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అనిల్ కుమార్, జిల్లా సైన్స్ ఫెయిర్ నోడల్ అధికారి అప్పారావు, డీఈఓ మందుల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

- ఎల్‌నినోతో నీటి కొరత ముప్పు: కలెక్టర్ స్నేహ శబరిష్



తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 21: ఎల్‌నినో ప్రభావంతో రానున్న యాసంగిలో వర్షపాతం తగ్గి నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు.జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో ఎఫ్‌పీఓలు, పీఏసీఎస్‌లు, ఆత్మ చైర్మన్లు, అధికారులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. పెసర, మినుము, శనగ, కంది, జొన్న, మొక్కజొన్న వంటి తక్కువ నీరు, పెట్టుబడితో సాగయ్యే పంటలను ప్రోత్సహించాలని సూచించారు. చెరువుల్లోని నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించాలని, వ్యవసాయానికి విడుదల చేయకుండా చూడాలని ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు.రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించారు. కూరగాయల సాగును పెంచాలని, కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటుకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. పీఏసీఎస్‌లు రైతుల సంక్షేమం కోసం వారంలోగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఎఫ్‌పీఓలు, పీఏసీఎస్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



చిన్నారిని ఆశీర్వదించిన డాక్టర్ ఎన్. అశోక్

- పట్టు వస్త్రధారణ వేడుకలో పాల్గొన్న దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 21: వలిగొండ మండలంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్‌లో సుక్క కిషన్, పావని దంపతుల కుమార్తె పట్టు వస్త్రధారణ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్. అశోక్ చిన్నారిని, కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు.

డ్రగ్స్, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.. షాద్‌నగర్ సీఐ సీతారాం





తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 21: విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని షాద్‌నగర్ పట్టణ సీఐ సీతారాం సూచించారు. షాద్‌నగర్ పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్స్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. స్నేహితుల ప్రభావం, ఫ్యాషన్ పేరుతో కొందరు యువత మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ వినియోగం, విక్రయాలపై సమాచారం ఉంటే 112కు ఫోన్ చేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ రుణ యాప్‌లు, గుర్తుతెలియని లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే షీ టీమ్స్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సైబర్ వారియర్స్ శ్రీనివాస్, రాజు అనిల్, ఎస్ఐ ధర్మియా రాథోడ్, షీ టీమ్ సభ్యులు రేష్మ, గీత, ఎస్ఎఫ్ఐ నాయకులు వడ్ల శ్రీకాంత్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పాఠశాల నిర్మాణానికి దాతల భారీ విరాళాలు

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో ఊపందుకున్న నిర్మాణ పనులు



తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 21: నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో చేపట్టిన పాఠశాల భవన నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ చొరవతో నిర్మాణానికి పలువురు దాతలు భారీగా విరాళాలు అందిస్తున్నారు. రియల్టర్ మహిపాల్ రెడ్డి రూ.10 లక్షలు, రియల్టర్ షకీల్ రూ.5 లక్షలు, స్థానిక జర్నలిస్టులు రూ.3 లక్షలు, చిలకమర్రి సర్పంచ్ రూ.లక్ష, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్ రూ.50 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఇతర దాతలు సైతం తమ వంతు సహకారం అందిస్తున్నారు. కాగా, శనివారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, గిరిజన కోఆర్డినేటర్ రఘునాయక్ నిర్మాణ పనులను పరిశీలించి పురోగతిని తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేసి భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పేద పిల్లల భవిష్యత్తు కోసం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి దాతల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

రియల్టర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో హోరాహోరీ పోరు

- అధ్యక్ష పదవి కోసం ఇద్దరు అభ్యర్థుల మధ్య ఉత్కంఠ



తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 21: షాద్‌నగర్ పట్టణ రియల్టర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. అధ్యక్ష పదవి కోసం ఇద్దరు అభ్యర్థులు బరిలో నిలవడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. సాధారణ రాజకీయ ఎన్నికలను తలపించేలా ప్రచారం, బ్యాలెట్ గుర్తుల కేటాయింపుతో పట్టణంలో ఎన్నికల సందడి నెలకొంది. ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండగా, అభ్యర్థులు తమ ప్యానెళ్ల తరఫున ఓటర్లను ఆకట్టుకునేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు, ఫ్యూచర్ సిటీ జిల్లా అధ్యక్షుడు రాజు గౌడ్ నేతృత్వంలో ఒక ప్యానెల్ ఎన్నికల బరిలో నిలిచింది. ఈ సందర్భంగా తన ప్యానెల్ అభ్యర్థులకు మద్దతు ప్రకటించిన రాజు గౌడ్ అసోసియేషన్ అభ్యున్నతి కోసం తమ ప్యానెల్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రచారం జోరందుకోవడంతో ఎన్నికల ఫలితాలపై రియల్టర్లలో ఆసక్తి నెలకొంది.

షాద్ నగర్ మున్సిపాలిటీ వార్డుల్లో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ప్రారంభం

- పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం: మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్





తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 21: షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఈ బీమా పథకం అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, కౌన్సిలర్లు అగ్గనూర్ విశాల, సి.పెంటయ్య, సంతోషిభాయి చందులాల్, బచ్చలి నరేష్, పి.గోపాల్, గౌస్ జానీ, శివ, సర్వర్ పాషా, తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వెంకిర్యాల వంతెన ప్రారంభం..

ప్రజల నిరీక్షణకు తెర

రూ.3.50 కోట్లతో నూతన బ్రిడ్జి.. మరో కోటితో అప్రోచ్ రోడ్డు

జహంగీర్ మృతితో చలించి.. వంతెన నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే శంకర్





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 21: షాద్‌నగర్ నియోజకవర్గంలోని వెంకిర్యాల గ్రామం వద్ద రూ.3.50 కోట్ల ఆర్‌అండ్‌బీ నిధులతో నిర్మించిన నూతన బ్రిడ్జిని శనివారం ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. త్వరలో మరో రూ.కోటి నిధులతో బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని వెల్లడించారు. గత పాలకుల అనాలోచిత నిర్ణయంతో పాత బ్రిడ్జిని కూల్చివేయడం వల్ల కొందుర్గ్–మహబూబ్‌నగర్ మధ్య రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని విమర్శించారు. వర్షాకాలంలో వాగులో పైపులు ఏర్పాటు చేసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ క్రమంలో వాగు దాటుతూ విశ్వనాథ్‌పూర్‌కు చెందిన జహంగీర్ మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని గుర్తుచేశారు. అనంతరం బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రత్యేకంగా కృషిచేసి పనులు పూర్తి చేయించామని తెలిపారు. నూతన బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అనిత జితేందర్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, నాయకులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఇందిరమ్మ బీమా కొండంత భరోసా

మోత్కూలగూడలో రూ.5 లక్షల బీమా పథకం పోస్టర్ ఆవిష్కరణ

ఇందిరమ్మ బీమాను సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ లావణ్య రమేష్

తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 21: పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.5 లక్షల ఇందిరమ్మ బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నందిగామ మండలం, మోత్కూల గూడ గ్రామ సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్ పిలుపునిచ్చారు.



గ్రామంలో శనివారం ఇందిరమ్మ బీమా పథకానికి సంబంధించిన పోస్టర్‌ను సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్, గ్రామ కార్యదర్శి స్వాతి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచేందుకు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల బీమా రక్షణ లభిస్తుందని తెలిపారు. ఈ పథకంపై గ్రామంలోని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని, అర్హులైన వారంతా వివరాలు తెలుసుకుని అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు భరోసా కల్పించే ఇలాంటి పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వానరసి నరసింహ, మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు లక్ష్మమ్మ, నాగేష్, సంతోష, లక్ష్మమ్మ, నరేష్, రమేష్, శైలజ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు, యువ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక కోటి దీపోత్సవానికి ఆహ్వానం

మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత

నవంబర్ 26 నుంచి 28 వరకు దీపోత్సవం..

29న అయ్యప్ప మహాపడి పూజ

తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 21: షాద్‌నగర్ పట్టణంలోని గౌరీ గార్డెన్ ఎదురుగా ఉన్న ఆకుల మనయ్య గ్రౌండ్‌లో ఈ నెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించనున్న కార్తీక కోటి దీపోత్సవ కార్యక్రమాలకు మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డిని నిర్వాహకులు ఆహ్వానించారు. అలాగే ఈ నెల 29న నిర్వహించనున్న శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమానికి కూడా ఆమెకు ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా కోటి దీపోత్సవ కమిటీ సభ్యులు సింగారం శ్రీనివాస్, సింగారం నివాస్, బర్మలి జంగయ్య, ప్యాట అశోక్, కొండోజు వంశీకృష్ణ, ప్యాట



జయ, శ్రీకాంత్, డాక్టర్ శ్రీధర్ గౌడ్, ఎదిర రాజేష్ గౌడ్, వెంకట్‌రెడ్డి, సన్నిధానం నరేందర్, గంధం శ్రీనివాస్, శ్రీనివాస్ ఆచారి తదితరులు తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 26, 27, 28 తేదీల్లో కార్తీక కోటి దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. 29న శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసంలో నిర్వహించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి భావాలను మరింత పెంపొందిస్తాయని అన్నారు. షాద్‌నగర్ పట్టణ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్తీక కోటి దీపోత్సవం, శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నిర్వాహకులు చేపడుతున్న పవిత్ర కార్యక్రమానికి ప్రజలందరూ తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్తీక దీపాల వెలుగులు, అయ్యప్ప స్వామి భక్తి పారవశ్యంతో నిర్వహించనున్న ఈ వేడుకలు షాద్‌నగర్‌లో ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి: సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి కుంట్ల నాగన్న

తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 21: పారిశుధ్య కార్మికుల పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి కుంట్ల నాగన్న డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా శనివారం పట్టణ కేంద్రంలో శ్రీనివాస సెంటర్లో సిఐటియు అనుబంధ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనల్గొండ పట్టణ కేంద్రంలో పారిశుద్ధ కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న చందుపట్ల రమణమ్మ పై దాడి చేసిన పెత్తందారులను వెంటనే అరెస్టు చేసి చట్టప్రకారం శిక్షించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి కుంట్ల నాగన్న కంపెళ్ళి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రమణమ్మ పై జరిగిన దాడికి వ్యతిరేకంగా ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్గొండ పట్టణానికి చెందిన బాలకృష్ణ అతని తల్లి ఇద్దరూ, మున్సిపల్ కార్మికురాలి గా విధులు నిర్వహిస్తున్న చందుపట్ల రమణమ్మ అనే కార్మికురాలిపై అకారణంగా కట్టెతో వెంటపడి మరి



దాడి చేసి గాయపరిచారన్నారు .పారిశుద్ధ కార్మికులు పుర ప్రజలు అందరికి సమానమైన సేవలు అందిస్తూ నిరంతరం అందుబాటులో ఉంటున్నారని, అటువంటి కార్మికుల పట్ల ఈ రకమైన దౌర్జన్యాలు,కుల దురహంకార దాడులను చేయడాన్ని యావత్ సమాజం ఖండించాలన్నారు. దాడికి పాల్పడ్డ బాలకృష్ణ మరి అతని తల్లిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులపై దాడులు జరిగిన సందర్భంలో స్థానికంగా ఉన్న అధికార యంత్రాంగము, స్థానిక ప్రజాప్రతినిధులు అనుసరిస్తున్న నిర్లక్ష్య విధానాలు కూడా ఈ దాడులకు ఒక కారణమన్నారు.ఇప్పటికే అతి తక్కువ వేతనాలు పొందుతూ,ఇచ్చే వేతనాలు సైతం నెల సక్రమంగా లేక, సామాజిక భద్రతా పథకాలు సరిగా అమలు కాక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న మున్సిపల్ కార్మికుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సింది పోయి ఈ రకమైన కులాంతర దాడులను చేయడం సరైంది కాదన్నారు. బాధితురాలికి న్యాయం జరిగేంత వరకు సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆవుల వీరన్న రజిని ఇమ్మడి పద్మ అర్చన ఫారినందుకు కృష్ణ చిరంజీవి వినయ్ రాజు అచ్చమ్మ వెంకటేష్ రాజేష్ ముత్తమ్మ వెంకన్న ఎల్లయ్య రాణి సరూప పద్మ శ్రీను మల్లేష్ పుష్ప రాజ్ తప్పెట్ల శ్రీకాంత్ జానీ శ్రీను గడ్డ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ రద్దు చేయాలి

యువకులపై కేసులు ఎత్తివేయాలి: పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

తొలి అక్షరం/కొత్తూరు, నవంబర్ 21: సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు 49వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సందర్శించి ఉద్యమానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధాపూర్ ప్రజల భవిష్యత్తును కాపాడుకునేందుకు శాంతియుతంగా పోరాడుతున్న యువకులపై కేసులు పెట్టడం, వారిని ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడుతున్న యువతపై కేసులు పెట్టడం దురదృష్టకరమన్నారు. జీఓ నంబర్ 641 విడుదలై ఇన్ని రోజులు గడుస్తున్నా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం



ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సైతం స్పష్టత లేని సమాధానాలు ఇస్తున్నారని విమర్శించారు. జీఓ నంబర్ 641ను ఎప్పుడు రద్దు చేస్తారు? సిద్ధాపూర్ ప్రజలకు ఎప్పుడు స్పష్టమైన సమాధానం ఇస్తారని ప్రశ్నించారు. ప్రజల ఆందోళనలను అర్థం చేసుకోకుండా యువకులపై కేసులు పెట్టడం, వారిని అవమానించేలా మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. డంపింగ్ యార్డ్ రద్దుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ప్రభుత్వం వ్యవహరిస్తే బీజేపీ ప్రజల పక్షాన నిలబడి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరించారు. బీజేపీ కార్యకర్తలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని దీక్షకు మద్దతు తెలిపారు.

Editor Pastham Saidulu, Tholi Aksharam, PRGI No. TGMUL/25/A1386,Gmail: tholiaksharam@gmail.com , Printing : R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad, Cell No: 8074571329, Telangana State, India.